***RELEASED FROM***
***CPI(M) state office***
H.No. 27-28-12, Yamalavari Street,
Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

# CPI - CPI(M)

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
తేది : 17 సెప్టెంబర్, 2018.

## అక్రమ అరెస్టుకు ఖండన

రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ భూములు, లంక భూముల రైతులకు ఇతర రైతులకు ఇచ్చినట్లే పరిహారం ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సామాజిక పెన్షన్ నెలకు రూ. 9వేలు ఇవ్వాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేయడానికి ప్రయత్నించిన అసైన్డ్ భూముల రైతులను, వారికి సంఘీభావంగా వెళ్ళిన వివిధ పార్టీల నాయకులను మందడం గ్రామంలో అరెస్టు చేయడాన్ని సిపిఐ(యం), సిపిఐ పార్టీలు ఖండిస్తున్నాయి.

సుదీర్ఘకాలంగా ఇతరులతో సమానంగా అసైన్డ్, లంక భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, సామాజిక పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అసైన్డ్, లంక భూముల రైతులు, వ్యవసాయ కార్మికులు ఆందోళనకు సిద్ధమయ్యారు. నిన్నటి నుండే రాజధాని ప్రాంతంలో రైతులను వారికి మద్ధతు ప్రకటించిన ప్రతిపక్ష పార్టీల నాయకులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేయడమే కాకుండా గ్రామాల్లో రైతులను తమ ఇళ్ళనుండి బయటకు రానీయకుండా భారీగా పోలీసులను మఫ్టీలో మోహరించి భయానక వాతావరణాన్ని సృష్టించారు. అనేకమంది రైతులను, దళితులను బెదిరించారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదుర్కొని పట్టుదలగా ముందుకు వచ్చిన వారిని అరెస్టు చేయడం గర్హనీయం.

అసైన్డ్, లంక భూముల రైతులు, వ్యవసాయ కార్మికులతోపాటు వారికి సంఘీభావంగా వచ్చిన సిపిఐ(యం) కేంద్రకమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జనసేన రాష్ట్ర కమిటీ కన్వీనర్ సిహెచ్.పార్థసారథి, రాజధాని ప్రాంత రైతులు, రైతు కూలీల సంఘం కన్వీనర్ అనుమోలు గాంధీ, వైఎస్సార్ సిపి ఎస్సీ సెల్ నాయకులు సందీప్, అసైన్డ్ రైతుల హక్కుల పోరాట వేదిక కన్వీనర్ ఫ్రాన్సిస్, సిపిఐ(యం) రాజధాని ప్రాంత కార్యదర్శి రవి, సిపిఐ ఏరియా కార్యదర్శి బి.వి.రాజు తదితరులను అరెస్టు చేసి తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో ఉంచారు.

అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, అసైన్డ్, లంక భూముల రైతులకు ఇతర రైతులతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సామాజిక పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

Ramakrishna
**(కె. రామకృష్ణ)**
రాష్ట్ర కార్యదర్శి

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి